శివపూజ



నేనూ శివుడు స్నేహితులం !

బొడ్డు కోసినపుడు వాడికి పెట్టిన పేరు శివశంకర్!– ఆ తరువాత ఇంట్లో వాళ్ళు ఆ పేరునే రెండుగా కోసి రెండవ భాగాన్ని వదిలిపెట్టి, మొదటి భాగానికి అనురాగాన్ని రంగలించి 'శివా!' అని ముద్దుగా పిలుచుకొనే వాళ్ళు. కానీ నేను మాత్రం 'శివుడూ!' అంటుంటాను.

శివుడు నేనూ ఒక కంచంలో తినలేదు. ఒక మంచంలో పడుకో లేదు. ఒక బడిలో చదువుకోలేదు. ఒక చోట కలిసి ఆడుకోలేదు.

అయినా మేము స్నేహితులం!

ఏది ఉండి ఏది లేకున్నా కనీసం వయస్సులు లేదా అభిప్రాయాలైనా కలగలిస్తే– సాధారణంగా స్నేహం కలవడానికి ఎదగడానికి అవకాశాలు ఉంటాయి. అవి అయినా ఉన్నాయా?– అంటే లేవు. నా బతుకులో పొద్దువాలిపోతే వాడి బతుకులో పొద్దు మొలిచి

ఇప్పుడిప్పుడే బారెడెక్కింది. ఇక అభిప్రాయాలందామా?– ఊరు చూడమంటే ఉత్తరం చూస్తుంటాయి. అంటే– ఒకరు ఉప్పు. ఒకరు నిప్పు!....

అయినా మేము స్నేహితులం !

ఇది భిన్నత్వంలో ఏకత్వం !

దీనిని పూర్వజన్మ సుకృతమంటాను నేను. 'పూర్వజన్మం... సుకృతం....గాడిద గుడ్డూ ఏవీ లేవు. ఇది కేవలం శాస్త్రం. వ్యతిరేక ధృవాల ఆకర్షణ. ఇది సహజం'– అంటాడు శివుడు. అది పూర్వజన్మ సుకృత ఫలమో? వ్యతిరేక ధృవాల ఆకర్షణ ఫలితమో? తెలియదు కానీ–

మేము మాత్రం స్నేహితులం!

ఆరేడు సంవత్సరాల కిందటి మాట. తిరుమలలో ఆర్ష సదస్సునుండి శ్రావ్యమైన గాత్రం భక్తి గీతాన్ని ఆలాపిస్తూ ఉంది. ఆ మధురిమలు కొండల్లో కోనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అనుభవిస్తూ నడుస్తున్న నా దృష్టిని ఓ కుర్రవాడు ఆకర్షించాడు.

పదహారు లేక పదిహేడేండ్లుంటాయి. ఓ పొట్టి నిక్కరు, చొక్కా తొడుక్కొన్నాడు. ఓ రావి చెట్టుకింద కూర్చుని ఆ బోదెకు చేరగిలబడి ఎటో చూస్తున్నాడు. ఆ బుల్లోడి తీరు గమనిస్తుంటే ఎవరో ఆరితేరిన ఒక వృద్ధుడు తీరుబాటుగా కూర్చుని జీవిత సత్యాన్వేషణలో మునిగి తేలుతున్నాడేమో? అనిపిస్తుంది. చూడ ముచ్చటగా ఉన్నాడు. నిలబడి కాసేపు నిదానించి చూశాను. ఆశ్చర్యం!– నేనూ చిన్నప్పుడు అలానే ఉండి ఉంటానేమో? అన్న భావన ప్రేరేపిస్తే దగ్గరికి వెళ్ళాను. ఆ దారి వెంబడి ఎందరో వస్తున్నారు. పోతున్నారు. ఎవరికీ, ఏమీ, పట్టనట్లుగా ఎవరి దారి వాళ్ళదిగా ఉంటే– నేను మాత్రం ప్రత్యేకించి ఆ కుర్రవాడిని పట్టించుకొన్నానన్న భావనతోనేమో ఎగిరిపడి లేచాడు. రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

వినయం నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

"ఏ ఊరు బాబూ?"

"తిరుపతి."

"ఏం చదువుతున్నావు?"

"పదవ తరగతి పాసయ్యాను."

"ఇక్కడ ఇలా ఒంటరిగా కూర్చున్నావెందుకు?"– అలాంటి సమయాల్లో అలాంటి చోట్లల్లో నరదాగా ఎవరైనా కూర్చోవచ్చు. కానీ ఆ కురవ్రాడి తీరులో ఏదో నిస్సహాయత కొట్టొచ్చినట్లు కనుపిస్తూంటే అడగాలని అడిగాను. ఒకసారి నావైపు చూశాడు దీనంగా. మళ్ళీ తల వాల్చుకొన్నాడు మౌనంగా!

"ఏం జరిగింది చెప్పు బాబూ!"

మళ్ళీ ఒక సారి తలెత్తి చూశాడు. కళ్ళ నిండుకు నీళ్ళు!– ప్రయత్న పూర్వకంగా ఆపుకొంటున్నట్లుంది. నా మనసు ద్రవించింది. భుజం తడుతూ అడిగాను మళ్ళీ– “ఏం జరిగిందో చెప్పు బాబూ!' అని.

“గుళ్ళో ఎవరో జేబు కొట్టేశారు సార్!” చాలా బాధగా అన్నాడు.

“ఓస్! అంతేనా!” నేను తేలికగా నవ్వేశాను.

ఆ కుర్రవాడు వింతగా చూశాడు నన్ను!

“ ఏం బాబూ! అలా వింతగా చూస్తున్నావు?”

ఆ పిల్లవాడి చూపుల్లో మార్పులేదు.

“జేబులు కొట్టడం, బతుకులు కొట్టడం, తలలు కొట్టడం– కొందరి అవసరానికీ, మరి కొందరి ఆనందానికి తమ్ముడూ!... ఈ వయస్సుకే ఇంత ఆలోచనలో పడితే ఎలా?”

“అదిగాదు సార్! ఈ అడవుల్లో పులులు, సింహాలు ఉంటాయి. అవి నోరులేని జంతువులు. అవి ఆహారం కోసమో ఆనందం కోసమో ఇతర జంతువుల్ని చంపుతాయి కానీ, స్వజాతిని మాత్రం తాకడం లేదు కదా? మరి మనిషి మనస్సుండి కూడా సాటి మనిషి నెత్తిమీదనే చెయ్యి పెడ్తున్నాడే?”–

ఆ లేత హృదయంలో పుట్టిన భావమో, లేదు ఒక మహాకవి అభిప్రాయమో?– తెలియదు. అవసరంకూడా లేదు. కానీ ఆలోచనా విధానానికి అబ్బురపడ్డాను.

ఆనాటి నుండి నేనూ శివుడు స్నేహితులం!

నా అభిప్రాయాలు వాడికి నచ్చవు. ఉపన్యాసాల మీద అసలు అభిప్రాయమే ఉండదు. అయినా వాడు నన్ను 'గురువుగారూ!' అని సంబోధిస్తాడు.

బార్లల్లో... బస్టాండ్లల్లో పడరాని నోళ్లల్లోపడి కంపుకొట్టే గురుశబ్దం శివుడినోట్లో మాత్రం సరాగాలు పోతుంది. మరలా మరలా పిలిపించుకోవాలని బుద్ధి పుడుతుందికూడా!

శివుడు చదువుకొంటున్నాడు. శివుడు తింటున్నాడు. శివుడు నిద్ర పోతున్నాడు. శివుడేకాదు– దాదాపు వాడి వయసులో ఉన్నవాళ్ళందరూ అదే పనిచేస్తుంటారు. అయితే తీరికవేళల్లో వాడి వయసు కుర్రవాళ్ళు బజార్ల మీద పడుతున్నారు. సినిమా హాళ్ళ మీద దాడి చేస్తున్నారు. గుళ్ళల్లో గుంపు చేరుతున్నారు. రంపుచేస్తున్నారు. అమ్మాయిలు కంటపడితే కళ్ళతో అందాన్ని తాగేయాలని తపనపడుతున్నారు. అయితే శివుడు మాత్రం తీరిక దొరికితే చాలు నాతో కలిసి తిరుగుతాడు. మేము కలిసి తిరుగుతూంటే లోకం మాతో కలిసి తిరుగుతుంది. మా ఒద్దిక కన్నుకుడ్తే నోరు పారేసుకొంటుంది. శివుడు నోరు చప్పరిస్తాడు, దాని తీరే అంత అంటూ!

అంత చిన్న వయస్సులోని వాడి ప్రవర్తనకు ఆశ్చర్యపడి ఆపై ఆలోచనలో పడి తరువాత అహాయపడడమే నా వంతు!

ఆ రోజు ఆదివారం. నిద్రలేస్తూనే నేను పూర్తి చేయాలనుకొన్న రచన 'హీరో కృష్ణ' గారి ఏకపాత్రాభినయం. పాపం కృష్ణ నాలుగైదు వారాలనుండి ఎదుటపడినప్పుడంతా నిలదీసి అడగకపోయినా అడిగినంత పని చేస్తున్నాడు. ఎక్కడో పోటీలట! నగదు బహుమతి మరీ పెద్దమొత్తంలో ఉందట!–

"చూడండి సార్ ! ఎన్నో పరిషత్తుల్లో పాల్గొన్నాను. ఎన్నో బహుమతులు వరించాయి. ఈ వెండి పై కప్పు కప్పుల మీద మోజు తీరిపోయింది. దీనిని గ్రహించినట్లున్నారు పరిషత్తు నిర్వాహకులు. ఏదో డబ్బు మోజు చూపుతున్నారు. అదీ గాక నా బతుకును మీలాంటి రచయితల చేతుల్లో పెట్టి ఏకపాత్రాభినయంగా ఆడి ఆశ తీర్చుకోవాలన్న తపన సార్ తపన!"– అంటూ అదో రకంగా పెడతాడు మొగాన్ని. అది చూస్తే 'అయ్యో! పాపం' అనిపిస్తుంది. అందుకే అప్పటికే నాలుగైదు వారాలుగ వాయిదా పడిన రచన తప్పనిసరిగ పూర్తిచేసి కానీ పైకి లేవగూడదనుకొన్నాను. అయితే ఎక్కడ ఎలా ఆరంభించి ఎలా ముగించాలో తోచక తికమకలు పడుతున్నాను.

"ఏం రాతలో తలరాతలు! ఆదివారం పూటయినా ఓ సినిమానా? పాడా? ఈ బతుక్కి ఓ పండగా పబ్బమా?... నేనూ చూస్తా ఉండా ఈ ఇంట్లో అడుగుపెట్టింది మొదులుకోని అంత మంచి మొగానికి అర్ధసేరు పసుపా? అన్నెట్టుండా దీబతుకు!"

అయిదు రోజుల క్రితం జ్వరం తగిలి మంచం మీద పడివున్న ఆరవ అమ్మాయికి జావకాయడానికి నూకవిసురుతూ శ్రీమతి ఒక్కొక్క మాటగా విసురుతూ ఉంది. మంచంమీద అమ్మాయి మూలుగుతూ ఉంది. కడగొట్టు నలుసు దేకుతూ దేకుతూ తల్లి ఒడి వరకు దేకి ఆపై రవికముడికై వెదకి, 'ఛళ్ళు' న చెంప దెబ్బ తిని ఆరున్నొక్క రాగాన్ని అందంగా ఆలాపిస్తున్నాడు. 'హీరో కృష్ణ' నన్ను వేధిస్తున్నాడు. కొంపలో జీవుల వేదన. నాలో జీవుని వేదన. ఇంటి పరిస్థితిని గాలికి వదిలేసి బయట పడి గాలి పీల్చుకొందమా? అనుకుంటే వీళ్ళకంటే చాలాచురుగ్గా ఉన్నాడు సూర్యభగవానుడు. గుడి కంటే ఇల్లే పదిలం ఈ రోజుల్లో అన్నభావన బుజ్జగిస్తే చతికిలబడి ఆ మీదట కాగితం మీద పడ్డాను.

ఎంత సేపు గడిచిందో తెలియదు. మంచం మీద మూలుగుతున్న అమ్మాయి మగత నిద్రలో ఉంది. ఆ పక్కనే కూర్చుని మంచంకోడుకు తల ఆనించి శ్రీమతి చిన్న కునుకు తీస్తూ ఉంది. చెంపదెబ్బతిన్న చంటి వాడు ఏడ్చి ఏడ్చి అంతకు మించిన సుఖం లేదన్నట్లుగా ఆమె తొడమీదనే ఒరిగిపోయాడు. నా చేతిలో కాగితం ఎప్పుడు ఎగిరిందో గాలికెగిరి మంచంకోడుకు తగులుకొని రెపరెప లాడుతూ ఉంది. ఇంట్లో వాతావరణం కుదుటపడే సరికి సూర్యుడు కూడా చురుకు తగ్గాడు. మురళి నా మనస్సులో మెదిలాడు.

మురళి ఓ చక్కని చిత్రకారుడు. అయితే మధ్య తరగతి మానవమాత్రుడై సామాన్య పరిస్థితుల మధ్య అనూహ్యంగా నలుగుతున్నవాడే!– అయితే ఈ మధ్య తానేదో సంస్థలో సభ్యుడుగా చేరాడట! ఆ సంస్థ ధ్యేయం ప్రార్థన. ప్రార్థన ద్వారా ప్రశాంతత! అక్కడ చేరింది

మొదలు అతడు హాయిగా ఉన్నాడట! అది ఎలా సాధ్యపడిందో తెలుసుకొని బతుకులోనేను పోగొట్టుకొన్న ప్రశాంతత మళ్లీ సాధించాలన్న తాపత్రయం. అందుకే అతనిని కలుసుకోవాలని పించింది. నేను మురళి కోసం బయలుదేరుతుంటే శివుడు నాకోసం వచ్చాడు.

నేను ముందు, వాడు వెనుకగా బయలుదేరాము. వెంటపడి దూడలా రావడమే తన పని అన్నట్లుగా ఉంటుంది వాడు పక్కన నడుస్తూంటే! అవసరం ఉంటే కానీ నోరు కదపడు. కానీ ప్రతి చిన్న సంఘటనను నిశితంగా గమనిస్తూ ఉంటాడు.

"మనమిప్పుడు మురళి దగ్గరికి వెళ్ళాలి."

శివుడు బదులు పలుకలేదు.

"ఎందుకని అడగవేం?"- బదులు రాదని తెలిసి కూడా నేనే అడిగాను.

"బొమ్మ గీయించుకోవడానికై ఉంటుంది."

"కాదు."

"మరి?"

"ప్రశాంతత కోసం!"

"అతను అమ్ముతాడా?"

"మనిషి సాధించవచ్చునని నమ్ముతాడు."

"ఆత్మవిశ్వాసముంటే మనిషి అన్నీ సాధించవచ్చు. దాని కతడే అవసరం లేదు." చాల నిర్లక్ష్యంగా ఉంది జవాబు.

కూత దూరంలోనే మురళి ఇల్లు. మా మాటలు మావిగా ఉంటే మేము మురళి ఇంట్లో అడుగుపెట్టాము. అడుగు అటూ యిటు కదపకుండా నిలబడిపోయాను. శివుడు నా పక్కనే ఉన్నాడు.

గీస్తూ గీస్తూ వదిలిన చిత్రం తాలూకు బోర్డు అలా పడిఉంది. రకరకాల కుంచెలు చిందర వందరగా పడిఉన్నాయి. రంగులు కలుపుకొనే పింగాణి ప్లేట్, సిరాబుడ్లు బుద్ధిగా కూర్చున్నాయి. స్టీల్ ఫ్రేములో ఓ క్యాబినెట్ సైజ్ ఫోటో ముందు ఉంది. ఆ మహాత్ముడెవరో తెలియదు. రమణ మహర్షిఛాయలు కనిపిస్తున్నాయి. పద్మాసనాసీనుడై మురళి ఆ బొమ్మ ముందు బొమ్మలా కూర్చున్నాడు. కండ్లు మూతలుపడి ఉన్నాయి. ఏకధారగా చెంపలమీదుగా కన్నీళ్లు కారుతున్నాయి. అవి ఆనందబాష్పాలో? దుఃఖాశ్రువులో తెలియదు! మా రాక అతని నిశ్చలతకు ఏ మాత్రం భంగం కలిగించలేకపోయింది. కాసేపు తదేకంగా అతనివైపు చూస్తు నిలబడ్డాను.

బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయి ఉన్నాడు మురళి. ఒక రకమైన తృప్తి... ఆ తృప్తి నుండి పుట్టిన వెలుగు- అతని మొగంలో ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. అంతర్దృష్టితోనే ఏదో దర్శిస్తున్నట్లున్నాడు. ప్రార్థన ద్వారా అతడు సాధించిన ఏకాగ్రతను తద్వారా అనుభవిస్తున్న ప్రశాంతతను చూసి మనసు ఉప్పొంగింది. చేతులెత్తి నమస్కరించాలన్న ఆలోచన కలిగినా

శివుడు పక్కన ఉండగా ఆ పనిచేయలేక పోయాను. మురళి ప్రశాంతతకు భంగం కలిగించడం ఇష్టంలేక అయిష్టంగానే అక్కడినుండి తిరుగుముఖం పట్టాము.

శివుడూ నేను వీధిని పడ్డాము.

"చూశావా శివుడూ?– మురళి ప్రశాంతతను అమ్ముతున్నాడో? నమ్ముతున్నాడో?"

"అంతకంటే ఆత్మవంచన మరొక్కటి లేదు"– శివుడు ఈ మాట అనడానికి తడుము కోలేదు. తడబడలేదు.

"ఏమంటున్నావ్?"

"అనవలసిన మాటే అన్నాను."

"నువ్వు అనవలసిన మాటయినా, నేను వినవలసిన మాట కాదు" కటువుగా అన్నాను.

"గురువుగారూ!"

అబ్బ! ఎంత కాలానికి శివుడి నోట్లో ఈ మాట? ఎంత హాయిగా ఉంది?.... అనుభూతిలో ఒళ్లు పులకరించి శివుణ్ణి చూస్తూ ఒక్క క్షణం నిలబడ్డాను. శివుడు నన్ను చూస్తూ నిలబడ్డాడు. చిరునవ్వు వాడి పెదాలమీద చిందులేస్తూ ఉంది.

"చిత్రలేఖనం, నటన, రచన లాంటి కళలు మనిషికి వరప్రసాదాలు. సృష్టిలో అవి ఏ కొందరికో పరిమితాలు. అందుకే వాళ్ళను కళాకారులంటున్నారు."

వాడు చెబుతున్నాడు. నేను వింటున్నాను.

"ప్రార్థన ఏకాగ్రతకు తద్వారా ప్రశాంతతకు సాధనమని మీ అభిప్రాయం. అవునా?"

"అవును."

"అయితే అశాంతికి నిలయమైన మీ ఇంట్లో ఏకాగ్రత లేకనే మీరు రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారా? ఏకాగ్రత లేకనే మురళి చిత్రాలు గీయగలుగుతున్నాడా? ఇంకొక్కడు నటించ గలుగుతున్నాడా?"

రెప్పవాల్చకుండా వింటూ ఆలోచిస్తున్నాను.

"ప్రార్థన ఏకాగ్రతకు సాధనమైతే కళారాధనలోనే ఏకాగ్రత ఇమిడి ఉంది. ఇక కళాకారులకు ప్రార్థన లెందుకు? ఆ సాకుతో అమూల్యమైన కాలాన్ని వృథా చేసే అధికారం కళాకారుడికి లేదు. చూడండి! మురళి బొమ్మ గీస్తున్నాడు. ఆ చిత్రం ఆత్మానందాన్ని కలిగించ వచ్చు. విప్లవాన్ని రేకెత్తించవచ్చు. అదేవిధంగా ఒకరి రచన..... మరొకరి నటన!– అవి లోక కళ్యాణం కోసం. మరి లోకకళ్యాణాన్ని వదిలిపెట్టి, చేస్తున్న పని అవతల పెట్టి ముక్కులు మూసుకొని కూర్చోవడం ఆత్మవంచన కాదంటారా?"

వాడి చిన్న బుర్రలోని భావాల వాడికి నా బుర్ర వేడెక్కింది.

"కళాకారులే కాదు. మడకపిడి పట్టి మన్ను దున్నేవాడైనా, కత్తి చేత బట్టి కట్టెలు కొట్టుకునేవాడైనా అంతే!...... పనిలో లీనమవడమే ఏకాగ్రత. పనిని వదిలిపెట్టి అదేపనిగా కాలయాపన చేయడం వృధా!.... అది ఆత్మవంచన!".....

ఆలోచించవలసిన విషయమే! దీనినే కర్మయోగమంటారేమో?

శివుడి ఆలోచనల్ని నేను అనుసరిస్తున్నాను. వాడు నన్ననుసరిస్తున్నాడు. మేము ముందుకు నడుస్తున్నాం!

రైల్వేస్టేషను దాటితే అటు పక్కగా పెద్ద సత్రం. దేవస్థానంవారు కట్టించిన సత్రాలలో అది రెండవది. కాబట్టి దానిని రెండో సత్రం అంటారు. కట్టిన కొత్తల్లో అక్కడ ఎక్కువ రద్దీ ఉండేదిగాదు. అప్పుడా సత్రం మధ్యభాగాన ఓ చక్కని తోట ఉండేది. కొత్త ఒక వింతగా ఆ తోటను చాల జాగ్రత్తగా కాపాడేది దేవస్థానం. 'పార్కు'కు నోచుకోని తిరుపతి పాలిటికి ఆ తోట ఓ చక్కని ఉద్యానవనం. సాయంసమయాల్లో మేధావులకు, న్యాయవాదులకు, రాజకీయవాదాలకు నిలయం. ఇప్పుడా వాతావరణం లేకపోయినా, జనసందోహంతో నిండిఉన్నా, అలవాటుపడ్డ ప్రాణులు అక్కడే చేరుతుంటాయి. ఇప్పుడు ఊరిని, రెండో సత్రాన్ని కలుపుతూ ఎత్తువంతెన నొకటి నిర్మించారు. ఆ ఎత్తు వంతెన ఎక్కి దిగితే రైల్వేస్టేషన్ మీదుగా రెండో సత్రములో పడవచ్చు. మా గమ్యమూ అదే!

ఊళ్లోవారిని రెండో సత్రానికి, రెండో సత్రంలోని యాత్రీకులను ఊళ్లోకి చేరవేయడానికి ఎత్తు వంతెన దగ్గరి మార్గం. అడుక్కొని తినే అంధులకు, కామాంధులకు, పెద్ద రోగపీడితులకు, పెద్ద పెద్ద మనుషుల స్వార్థాల తాడితులకూ, ఆధారమైన ఆ వంతెన మెట్లు ఎక్కుతున్నాం.

నలుగురు నాలుగు దిక్కుల్లో కూర్చున్నారు మెట్లమీద ఓరగా! ఒకడి నోట్లో బీడీ, మరొకడి నోట్లో సిగరెట్టు మంచి రసపట్టులోఉన్నాయి. ఆకారాల మాట వదిలి ఆ తలల్ని పరిశీలిస్తే నాలుగు కాకి గూళ్ళను ఒక్కచోట వేలాడగట్టినట్లుంది. తలల్ని వదిలి ఆకారాల్ని చూస్తే కాలీకాలక నిలిచిన తొర్రమానుల్లా ఉన్నాయి. పులిమేక ఆడుతున్నారు. అడుక్కొన్న డబ్బులు ఆటకు రక్తి కట్టిస్తున్నాయి. వాళ్ళకూ బాహ్యస్మృతి లేదు.

మరొక్క మూల మూడు ముక్కలాట మహాజోరుగా సాగుతూ ఉంది. అక్కడి వాతావరణం దీనికి భిన్నంగా ఉంది. బిచ్చగాళ్లే కాదు– కాస్త పచ్చంగా ఉన్నవాళ్ళూ అక్కడ నిలబడి ఉన్నారు.

తనకు రావలసిన 'ధర్మం' మరొక్కడు అడ్డం దూరి తన్నకపోతే, ఆ అధర్మంమీద ధర్మయుద్ధం కొనసాగుతూ ఉంది ఇద్దరి ముష్టివాళ్ల మధ్య. ఒకడికి కాలు కుంటి. మరొక్కడికి చేయి మొండి. ధర్మయుద్ధంలో ప్రయోగింపబడుతున్న అస్త్రాల ధాటికి ఆదారిలో వెడుతున్న ఆడవాళ్ళు చెవులు మూసుకొంటున్నారు. మగవాళ్ళు మొగాలు చిట్లించుకొంటున్నారు.

మరొక్క నికృష్టుడు ముష్టి మెతుకులు తినడానికి కష్టపడుతున్నాడు. వాడికి సంక్రమించిన రోగం పేరు పెద్దరోగం. ఆ రోగం ఆకలితో అతని చేతివేళ్ళు తినేస్తే– వేళ్ళు లేకుండా మిగిలిన అరచేత్తో ఆకలి మాపుకోవడానికి యాతనపడుతున్నాడు.

మెట్లు దిగుతున్నాం అవతలివైపున!

ఈలాంటి రోగగ్రస్థులే! ఓ గుంపు చేరారు. ఆ గుంపులో పాట! అడుక్కొనేవాళ్ళు పాడే పాటగాదు. అది వేలంపాట. అది వారంచీటీ పాట! ఈ పుణ్యక్షేత్రంలో పుణ్యం మూటగట్టు కోవడానికి ప్రతినిత్యం జనప్రవాహం వెంటపడి అడుక్కొన్న డబ్బుతో వాళ్ళు ఓవారం చీటీ నడుపుతున్నారు. ఎవరిపాట ఎక్కువయితే వాళ్ళకు చీటీ డబ్బు వస్తుంది. వాడు ఆ డబ్బుతోనే వడ్డీ వ్యాపారం చేస్తాడు వాళ్ళతోనే!– చాలా చిత్రంగా ఉంది ఆ రోగ పీడితుల వడ్డీరోగం.

ఈ పక్క మెట్లెక్కి ఆ పక్కమెట్లు దిగేలోపుగా బతుకుల్లో ఎన్ని ఎగుడు దిగుళ్ళు ఎదురయ్యాయి?– అందుకే 'ఏం బతుకులో?' అన్నాను నిస్పృహతో!

"ఏం బతుకులా?.... నిలువునా నిలబెట్టి కాల్చాల్సిన బతుకులు!" కసిగా అన్నాడు శివుడు. దిగువ మెట్టుమీద కాలు దిగువ మెట్టుమీదనే ఉంది. ఎగువ మెట్టుమీద వేసిన కాలు వేసినట్లే ఉంది. అలానే నిలబడిపోయాను ఆశ్చర్యంతో!

"అవును. ఈలాంటి నికృష్టజీవులందర్నీ నిలబెట్టి కాల్చి చంపాల్సిందే! వీళ్లవల్ల ఏం లాభం?..... భూమికి బరువు తప్పితే! ఏం? అలా భయపడుతున్నారు? తమవంటి కవులకు, రచయితలకు ఆ మీదట కవితా వస్తువు కొరవడుతుందనా?"

నా నోరు మూతపడింది.

"నీ మట్టుకు నువ్వెంత రాస్తున్నావు? వేదికలమీద అవకాశం దొరికితే ఎంత చక్కగా ఉపన్యాసాలు దంచేస్తున్నావ్? రాతలకు చేతలకు సామ్యం వుంటే– ఇలాంటి తలరాతలకు తావుంటుందా?" అని శివుడు నన్ను నిలదీసి అడుగుతున్నట్లుంది! 'ఆఁ ఊఁ!' అనకుండా ఆలోచిస్తూ నడుస్తున్నాను.

రెండో సత్రములో దీపాలు వెలిగాయి. యాత్రికులు గుంపులు గుంపులుగా చేరి ఒకచోట వండుకొంటూ, మరొకచోట గుంపుగా చేరి తింటూ, మరికొందరు ఆరుబయట అలానే సొమ్మసిల్లి పడి దొర్లుతూ, గజిబిజిగా ఉంది వాతావరణం. ఒకనాటి తోట ఛాయలు నామమాత్రంగా మిగిలిన తోటలో కూర్చున్నాం. కూర్చున్నామన్న మాటేగానీ కుదురుగా కూర్చోలేకపోతున్నాను. శివుడు తలనొప్పిగా తయారయ్యాడు. మాటకు చేతకు కలసామ్యాన్ని నిరూపించాలని తపనపడే మనసు నోరుమూయించింది. ఆలోచనలు రెక్కలు విప్పుకొన్నాయి. తగిన పరిష్కారం అందక తపిస్తున్నాయి. అయినా– అవకాశం రాకపోతుందా? అని మనస్సు తనంతట తాను సమాధాన పడుతూ ఉంది. నెమ్మదిగా కూర్చోలేకపోతున్నాను. అందుకే బయలుదేరాను. నాతో కలిసి శివుడు బయలుదేరాడు.

అదే ఎత్తువంతెన మీదుగా తిరిగివస్తున్నాం. ఆ వంతెనమీద చెప్పుకోదగిన మార్పేమీ కనిపించలేదు. లేదంటే అక్కడ కూడా దీపాలు వెలిగాయి. కొంతమంది పడుకోవడానికి దుమ్ము దులుపుకొంటున్నారా వంతెనమీద. రైల్వేస్టేషనువైపు నుండి గబ గబా మెట్లెక్కి వస్తున్నాడొక కుర్రవాడు. పది పన్నెండేండ్ల వయస్సు ఉంటుంది. తెల్లటి పంచె గోచీపెట్టి కట్టాడు. ఒంటిమీద

జందెము.... నొసట అందంగా బొట్టు... చేతిలో ఒక బుట్ట... బుట్టలో వడలు.... మురుకులు చూడ ముచ్చటగా ఉన్నాడు. 'సార్! సార్!' అని అరుస్తున్నాడు. ఆగాను. పరుగెత్తుకొని దగ్గరకు వచ్చాడు. గసపోస్తూ నిలబడ్డాడు. వింతగా వాడివైపు చూస్తూ నిలబడ్డాను.

"వడలు... మురుకులు... సార్!"

"కనబడుతున్నాయిగా!"

"ఫ్రెష్‌గా ఉన్నాయి సార్!"

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"కొన్ని కొనుక్కోమంటాను సార్!"

"ఛీ ఛీ!"

"సార్!.... సార్...! మేం బ్రాహ్మలం సార్. మా అమ్మ మరీ మడి గట్టుకొని చాలా శుభ్రంగా చేసింది సార్! అలా చూస్తారేం సార్?– అమ్మతోడు!... అబద్ధంగాదు సార్.... రెండు కొనండి సార్!"

"ఛీఛీ! నీకు బుద్ధుందా! అలగాజనం మాదిరి దారి తిండ్లు తినమంటావా? వద్దు పో!"

బయలుదేరబోయాను. అడ్డం పడ్డాడు కుర్రాడు.

"సార్! మా నాన్న చచ్చిపోయాడు. మా అమ్మ ఒక్కతే. నలుగురి పిల్లల్ని సాకాలి సార్. నేనే పెద్దోడిని. మీ లాంటి వాళ్ళు మాలాంటి వాళ్ళకు సాయం చెయ్యాలి సార్!.... చెయ్యక పోతే ఇంకెవరు చేస్తారు. సార్!" బ్రతిమలాడుతున్నాడు.

"చుశావా శివుడూ!"

"చూస్తున్నాను."

"వేలెడంత వెధవ! ఎంత చక్కగా చెబుతున్నాడో కథలు!"

"సార్! సార్! అమ్మతోడు!... నేను అబద్ధం చెప్పడం లేదు సార్!"

"రేయ్. కథలు పలుకుతున్న వెధవాయ్! నీ చిలక పలుకులకు మీ అమ్మతోడా?... వడలూ వద్దు. మురుకులూ వద్దు... వెళ్ళు" కసిరాను.

"ఒరే నాన్నా! కథలు చెప్పకూడదురా! రాయాలి. రాస్తే నిన్ను రచయిత అంటారు. గౌరవిస్తారు. ఇక సభలు.... సన్మానాలూ వగైరా.... వగైరా! వద్దురా అంటే, అలా పీక్కుతింటా వెందుకు? తప్పుగదూ! వద్దంటూనే బుద్ధిగా వెళ్ళిపోతే మంచి కుర్రాడంటారు గురువుగారి లాంటి వాళ్ళు! అవును బాబూ!" శివుడి మాటల్లో వ్యంగ్యం తొంగిచూస్తున్నట్లుంది. ఎలా దెబ్బ కొడతాడో ఏమో? అని వాడివైపు బిత్తరపడి చూస్తున్నాను.

"ఇంతకూ బుట్టలో ఏమాత్రముంటాయి వడలూ, మురుకులూ?" శివుడు అడిగాడు.

"బుట్టలోనా సార్!.... ఇదో సార్!.... చెబుతాను సార్!... నాలుగు.... ఎనిమిది.... పన్నెండు– అట! మొత్తం రెండు రూపాయల నలభై పైసల కున్నాయి సార్!"

"ఊc! ఇలా ఇవ్వు!" గద్దించాడు శివుడు. రెండు రూపాయల నలభైపైసలు వాడిచేత పెట్టి బుట్టందుకొన్నాడు శివుడు. నేను మాన్పడి నిలబడిపోయాను. వాడు నావంక చూడడం లేదు. కనీసం నేను అక్కడ ఉన్నట్లు కూడా వాడికి స్పృహలేదు. తనపని తనిదిగా ఆ వంతెన మీద ఉన్న నికృష్ణ జీవులందరికి తలకొక్క మురుకు వడవంతున పంచాడు. బుట్ట ఖాళీ అయింది. ఖాళీ బుట్టను ఆ కుర్రవాడి చేతికిచ్చాడు.

అప్పుడు చూడాలి ఆ కుర్రవాడి ఆనందం. ఆదరాబాదరా డబ్బులు పంచె కొనకొంగులో మూట కట్టుకొన్నాడు. బుట్టను అలా గాలిలో ఎగరేసి పట్టుకొన్నాడు. నెత్తిన బోర్లించుకొన్నాడు కిరీటంలా! నావంక ధీమాగా చూశాడు రాజులా! ఆపై పరుగందుకొన్నాడు ఆనందానికే కాళ్ళు చేతులు వచ్చినట్లుగా!

పరుగెత్తుతున్న కుర్రవాడిని చూశాను. పక్కనున్న శివుణ్ణి చూశాను. వంచిన తల ఎత్తకుండా ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగుతున్నాను.

"నమస్కారం సార్!"

తలెత్తి చూశాను. నెత్తిమీద పెట్టె పడకా... ఒక భుజాన సంచి... ఒకచేత క్యారియర్.... మరోచేత ఓ చిన్న సూట్‌కేస్– మోయలేక మోస్తూ వంతెన మెట్లెక్కుతున్నాడు హీరో కృష్ణ.

"మా అయ్యగారు ఊరెళ్ళుతున్నారు సార్! బండెక్కించాలి సార్!.... సార్ సార్! నా ఏకపాత్రాభినయం...."

నన్నుచూసి ఆగాడు కృష్ణ. నవ్వుతూ అడుగుతున్నాడు కృష్ణ. ఆలోచిస్తూ అతనివైపు చూశాను.

కృష్ణ శ్రమను చిరునవ్వుతో స్వీకరిస్తున్నాడు. తానొక జవానని బాధపడడంలేదు. తాను చేస్తున్న పనిని చులకన దృష్టితో చూడడంలేదు. కళాత్మకంగానే చూస్తున్నాడు. అలానే చేస్తున్నాడు. అది అతనిలో ప్రత్యేకత. అంత కష్టంలో కూడా తానొక కళారాధకుడుగా కర్తవ్యాన్ని గుర్తు పెట్టుకొన్నాడు. అతడు ఒక్కొక్క మెట్టుగా పైకెక్కుతున్నాడు.

నేను ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగాను. తిరిగి చూశాను. కృష్ణ ఒక్కొక్క మెట్టుగా పై కెక్కుతూనే ఉన్నాడు. శివుడు వంతెనమీదనే నిలబడి ఎటో చూస్తున్నాడు.

ఇది భిన్నత్వం!

ఈ భిన్నత్వంలో ఏకత్వ సాధించాలంటే శివుడి ఎత్తుకు ఎదగాలి!

'శివుడూ!' అని పిలిచాను ఎలుగెత్తి.

'గురువుగారూ!' అన్నాడు అంత ఎత్తున నిలబడి!

'గురువుగారూ?'– ఈమాట అనవలసింది నేనా? వాడా?

అనుకొన్నది వాడంటున్నాడు. అనవలసింది నేను అనలేక పోతున్నాను.

అనవలసింది అనడం అనింది చేయడమే 'శివపూజ!' ●

భారతి
(1, అక్టోబర్ 1977)

కథా నిలయం
శ్రీకాకుళం